సామాన్యుడి గొంతుగా.. సామాజిక సమర వేదికగా..

# మన చౌరాస్తా

The Complete News way

మన చౌరాస్తా
Telugu News
Channel

సంపుటి : 02 | సంచిక : 40 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | శుక్రవారం | 23.05.2025




## మేం చేస్తున్న అభివృద్ధి

# కనబడుతోంది

- అమృత్ భారత్ పథకం కింద రైల్వే స్టేషన్ ఆధునీకరణ
- ప్రారంభోత్సవంలో కేంద్ర మంత్రి బండి సంజయ్

**కరీంగనర్, మన చౌరాస్తా :** గతంలో బీఆర్ఎస్ సహా కొన్ని పార్టీల నాయకులు రైల్వే అభివృద్ధిపై కేవలం లేఖలు రాసి బాధ్యతను దులుపుకున్నారని, కానీ అలా కాకుండా తాము అభివృద్ధికి కట్టుబడి పనిచేశామని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. ఇప్పుడు అభివృద్ధి కనిపిస్తున్న తరవాత కూడా ఇదంతా తమ వల్లే జరిగిందని ప్రచారం చేసుకుంటున్నారని మండిపడ్డారు. మాటలకే పరిమితమవ్వకుండా వాస్తవిక ఫలితాలు చూపాలన్నది ప్రధాన విషయం. బుల్లెట్ దిగిందా? లేదా? అనేది ప్రజలే తేల్చాలని బండి సంజయ్ కుమార్ వ్యాఖ్యానించారు.అమృత్ భారత్ పథకం కింద ఆధునీకరించిన కరీంనగర్ రైల్వే స్టేషన్‌ను ప్రధాని నరేంద్ర మోడీ వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బండి సంజయ్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ గతంలో ఎవరి పాలనలో అభివృద్ధి జరిగిందో కరీంనగర్ స్టేషన్ మార్పే నిదర్శనమన్నారు. అలాగే, జమ్మికుంట రైల్వే స్టేషన్‌ను కూడా అమృత్ భారత్ పథకంలో చేర్చేందుకు ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. 61 కిలోమీటర్ల మేర ఈ లైన్ నిర్మాణానికి సర్వే పూర్తయ్యిందని, డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ కూడా సిద్ధమైందని చెప్పారు. దీని కోసం రూ.1480 కోట్ల వ్యయం అంచనా వేసినట్టు వివరించారు. త్వరలో కేంద్రం దీనిపై నిర్ణయం తీసుకుంటుందన్నారు. కరీంనగర్ నుంచి తిరుపతికి నిత్య రైలు నడిపేందుకు తనతో పాటు మంత్రి పొన్నం ప్రభాకర్ కూడా లేఖలు రాశారని చెప్పారు. అయితే రద్దీ , సాంకేతిక కారణాల వల్ల అది సాధ్యపడ లేదని, ప్రస్తుతం వారానికి రెండుసార్లు నడుస్తున్న ఈ రైలును నాలుగు సార్లు నడిపేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దేశవ్యాప్తంగా రూ.25 వేల కోట్ల వ్యయంతో 1350 రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేస్తున్నామని, వాటిలో భాగంగా రూ.2 వేల కోట్లతో ఆధునీకరించిన 103 స్టేషన్లను ప్రధాని నరేంద్ర మోడీ వర్చువల్‌గా ప్రారంభించారని అన్నారు.

కరీంనగర్ స్టేషన్ కూడా వాటిలో ఒకటి. రూ.27 కోట్ల వ్యయంతో జరిగిన ఆధునీకరణ పనుల తరువాత కరీంనగర్ రైల్వే స్టేషన్ రూపురేఖలు పూర్తిగా మారిపోయాయని తెలిపారు. గత 11 ఏళ్లలో రాష్ట్రంలో 20కి పైగా ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టామని, మొత్తం 2,298 కిలోమీటర్ల పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ఒక్క తెలంగాణకే రూ.42,119 కోట్ల విలువైన పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో మాత్రమే రూ.5,337 కోట్ల బడ్జెట్ కేటాయించామన్నారు. జమ్మికుంట రైల్వే స్టేషన్‌ను త్వరలో అమృత్ భారత్ పథకంలో చేర్చుతామని, ఉప్పల్ ఆర్వోబీ నిర్మాణంలో కూడా ఒక లైన్‌ను త్వరలో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. హసన్‌పర్తికరీంనగర్ నూతన రైల్వే మార్గానికి సంబంధించిన అన్ని చర్యలు వేగంగా పూర్తవుతాయని తెలిపారు.



### అభివృద్ధికి పట్టుబట్టా : మంత్రి పొన్నం

తాను కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడిగా ఉన్నప్పుడు ఆనాటి రైల్వే శాఖ మంత్రి మమతా బెనర్జీ ఉన్నప్పుడు కరీంనగర్ ఈ స్టేషన్ ను మార్పు చేయడం జరిగిందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా దేశంలో 103 స్టేషన్ లలో తెలంగాణ నుండి కరీంనగర్, వరంగల్, బేగంపేట రైల్వే స్టేషన్ లను పునరాభివృద్ధి చేసి ప్రారంభం చేసుకున్నందుకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రయాణికుల సౌకర్యం కోసం అధునాతన సౌకర్యాలతో పునరభివృద్ధి చేసుకొని ప్రారంభం చేసుకున్నామని, 1267, 1268 నంబర్ ట్రైన్ కరీంనగర్ నుంచి తిరుపతి, తిరుపతి నుంచి కరీంనగర్ వెళ్లే రైలు వారానికి రెండు రోజులు నడుస్తుంది దానిని ప్రతిరోజూ లేదా వారానికి నాలుగు రోజులు నడిచేలా చేయాలని కేంద్ర మంత్రి బండి సంజయ్, రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను పొన్నం కోరారు. తిరుపతి రైలుకు ప్రయాణికుల రద్దీ బాగుండడంతో నిత్యం వెళ్లేలా చేస్తే చాలా బాగా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. రైల్వే స్టేషన్ లో ఫర్టిలైజర్ లోడిరగ్, అన్ లోడిరగ్ హమాలీ సమస్యలను తొలగించామన్నారు. కరీంనగర్ నుంచి ముంబయి, షిర్డీలకు రైలు ప్రారంభిస్తే అందరికీ ఉపయోగపడుతుందని వివరించారు. ఎమ్మెల్సీలు అంజిరెడ్డి, కొమురయ్య పాల్గొన్నారు.



వ్యవసాయం సర్కారు

## స్పెషల్ ఫోకస్

- జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా

2



సీఎంఆర్ఎఫ్ లక్ష్యాలను

## పూర్తి చేయాలి

- అడిషనల్ కలెక్టర్ రోహిత్ సింగ్

2



ఘనంగా హనుమాన్

## జయంతి వేడుకలు

- పాలకుర్తి ఆలయంలో ప్రత్యేక పూజలు

3

General News



# వ్యవసాయంపై సర్కారు ప్రత్యేక దృష్టి

- నాణ్యమైన విత్తనాలను విక్రయించాలి
- కల్తీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు
- రైతులను మోసం చేస్తే ఉపేక్షించేది లేదు
- కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**జనగామ, మన చౌరాస్తా :** రైతులకు కల్తీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని, వారిని మోసం చేయాలని చూస్తే ఉపేక్షించేది లేదని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పేర్కొన్నారు. గురువారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని ప్రధాన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్, డీసీపీ రాజ మహేంద్ర నాయక్, ఏసీపీ పండరి చేతన్ నితిన్‌తో కలిసి కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ వానాకాలం పంట గురించి విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల డీలర్లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ప్రజలు ఎక్కువగా వ్యవసాయంపైనే ఆధారపడి జీవనం సాగిస్తుంటారన్నారు. వానాకాలం పంట కోసం రైతులకు నాణ్యమైన విత్తనాలను మాత్రమే విక్రయించాలని పేర్కొన్నారు. జిల్లాలో పోలీసు శాఖ, వ్యవసాయ శాఖ, రెవెన్యూ శాఖ అధికారులతో టాస్క్ ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేశామని, వారందరూ సమన్వయంతో పని చేయాలని, విస్తృత తనిఖీలు నిర్వహించాలని, నకిలీ, కల్తీ విత్తనాల సరఫరా జరగకుండా తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రామస్థాయిలో రైతులకు నాణ్యమైన విత్తనాల కొనుగోలుపై రైతు వేదికల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఈ క్రమంలో క్షేత్రస్థాయిలో ఎంఏఓలు, ఏఈఓలు ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని పేర్కొన్నారు. ఎక్కడైనా నిబంధనలు ఉల్లంఘించి నకిలీ విత్తనాలు విక్రయిస్తే దుకాణాల యజమానులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. నాణ్యమైన విత్తనాలు రైతులకు అందే విధంగా చూడాలన్నారు. డీలర్లందరూ విత్తన చట్టానికి లోబడి, నిబంధనలను అనుసరిస్తూ వ్యాపారం నిర్వహించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ నకిలీ విత్తనాల విక్రయాలు చేయరాదని తెలిపారు. ప్రతి రోజు స్టాక్ బోర్డును తప్పనిసరిగా ప్రదర్శించాలని, ఎప్పటికప్పుడు స్టాక్ రిజిస్టర్లలో రైతుల కొనుగోళ్ల పూర్తి వివరాలను క్షుణ్ణంగా, విధిగా నమోదు చేయాలన్నారు. డీసీపీ రాజమహేంద్ర నాయక్ మాట్లాడుతూ.. విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల విక్రయాల్లో ఎలాంటి నిర్లక్ష్యం వహించరాదని, దుకాణదారులు నాసిరకం విత్తనాలు అమ్మినా, కాలపరిమితి లేని విత్తనాలు అమ్మినా, లైసెన్స్ లేకుండా లేదా లైసెన్స్ రెన్యూవల్ చేయకుండా వ్యాపారం చేసినా, విత్తనాల కంపెనీలకు సంబంధించిన లేబుల్స్ సరిగా లేకపోయినా, ధరల పట్టిక రికార్డులు సక్రమంగా నిర్వహించకపోయినా చర్యలు తప్పవన్నారు. విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు బిల్లులు ఇవ్వకపోయినా, బిల్లుల్లో లాట్ నెంబర్లు రాయకపోయినా, నెలవారీ నివేదికలు సంబంధిత అధికారులకు సమర్పించకపోయినా దుకాణాదారుల యజమానులపై విత్తనాల చట్టం ప్రకారం కేసులు నమోదు చేసి, ఒక నెల నుంచి ఏడేళ్ల వరకు జైలు శిక్ష విధించడం జరుగుతుందని హెచ్చరించారు. అంతకుముందు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల విక్రయాలపై డీలర్లకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షణ ఇచ్చి అవగాహన కల్పించారు. అనంతరం పలువురు డిప్లొమా ఇన్ అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ సర్వీసుల ఇన్పుట్ డీలర్లకు జ్ఞాపికలతో పాటు ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో డీఏఓ రామారావు నాయక్, ఘనపూర్ (స్టేషన్), వర్ధన్నపేట ఏసీపీలు భీం శర్మ, నర్సయ్య, డీపీడీ విజయ శ్రీ, ఏడిఏలు, అన్ని మండలాల వ్యవసాయ అధికారులు, ఎస్ఐలు, సీఐలు, విత్తనాల అసోసియేషన్ ప్రెసిడెంట్ పజ్జూరి గోపయ్య, విత్తన, ఎరువుల డీలర్లు, పురుగు మందుల దుకాణాదారుల యజమానులు, సిబ్బంది పాల్గొన్నారు.





## సీఎంఆర్ లక్ష్యాలను తర్వగా పూర్తి చేయాలి

### అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్

**జనగామ, మన చౌరాస్తా:** 2024-25 వానాకాలం (ఖరీఫ్) సీఎంఆర్ లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్ మిల్లర్లకు సూచించారు. గురువారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని ప్రధాన సమావేశ మందిరంలో ఆయన వానాకాలం సీఎంఆర్ లక్ష్యాలపై రైస్ మిల్లర్లతో సమీక్షా నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ఇప్పటి వరకు జిల్లాలో వానాకాలం సీఎంఆర్ లక్ష్యం 75.40 శాతంగా ఉందని పేర్కొన్నారు. అలాగే ఈ సీజన్లో 1,36,867.080 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుమతైందన్నారు. ఇందులో కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) 91700.944 మెట్రిక్ టన్నులు కాగా 69248.894 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ రైస్ డెలివరీ పూర్తయిందన్నారు. మిగిలి ఉన్న ధాన్యం లక్ష్యాలను త్వరగా పూర్తిచేయాలని మిల్లర్లను ఆదేశించారు. జిల్లాలో బాయిల్డ్, రా రైస్ మిల్లర్లు వారికి కేటాయించిన రోజూవారీ లక్ష్యాలను పూర్తి చేయాలని సూచించారు. ఈ సీఎంఆర్ లక్ష్యాలపై ఎవరైనా మిల్లర్లు అలసత్వం వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో డీఎం సీఎస్ హతీరాం, డీసీఎస్ఓ సరస్వతి, డీఏఓ రామారావు నాయక్, ఏసీఎస్ఓ ఇర్ఫాన్ అహ్మద్ ఖాన్, డీటీ సీఎస్ లు శ్రీనివాస్, దేవా, మిల్లు అధ్యక్షులు బెల్ది వెంకన్న, జయహరి, శ్రీధర్, రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.




## పద్యం తెలుగు సాహిత్య తలమానికం

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో తెలుగు భాష ఉపాధ్యాయులకు శిక్షణా కార్యక్రమాల్లో భాగంగా గురువారం 'తెలుగు పద్య వైభవం' అనే అంశం మీద ప్రముఖ కవి, పరిశోధకులు డాక్టర్ శంకరమంచి శ్యాంప్రసాద్ విస్తృత ఉపన్యాస కార్యక్రమం నిర్వహించారు. పద్యం తెలుగు సాహిత్య గౌరవాన్ని నిలబెడుతూ వందల సంవత్సరాలుగా వివిధ భూమికలను నిర్వహిస్తూ రసవంతమైన కావ్యాలకు ఆధారమై వర్ధిల్లుతోందని పేర్కొన్నారు. సమావేశానికి జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్న అధ్యక్షత వహించగా ప్రత్యేక ఆహ్వానితులుగా తెలుగు సాహిత్యపీఠం అధ్యక్షుడు పానుగంటి రామమూర్తి హాజరైనారు. కార్యక్రమంలో ఏఎంవో శ్రీనివాస్, ఎస్‌వో రమేశ్, ఆర్పీలు శేషుకుమార్, రజితకుమారి, బలరాం, శ్రీనివాసాచారి, కుమారస్వామి, రమేశ్‌తో పాటు 135 మంది తెలుగు భాషా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

Local News



# కేజీవీబీల్లో కిచెన్ గార్డెన్ల ఏర్పాటు

**జనగామ, మన చౌరాస్తా :** ఆర్గానిక్ ఉత్పత్తుల పట్ల అవగాహనను కల్పించడంతో పాటు , క్షేత్ర స్థాయిలో పండించిన పంట దిగుబడిని ఆహారంగా తీసుకునే అనుభూతిని విద్యార్థులకు కల్పించి.. రాబోయే తరాన్ని ఆరోగ్యకరమైన తరంగా అభివృద్ధి చేసే సదుద్దేశంతో నిర్మణ్ సంస్థ ముందుకు రావడం స్ఫూర్తి దాయకమని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. కొడకండ్ల, దేవరుప్పుల, జనగామ, లింగలఘణపురం కేజీబీవీల్లో కిచెన్ గార్డెన్ ను ఏర్పాటు చేయనున్న నిర్మణ్ సంస్థ ప్రతినిధులు గురువారం కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్‌ను ఛాంబర్లలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. నిర్మాణ్ సంస్థ చేసే అభివృద్ధి కార్యక్రమాలకు పూర్తి సహకారం జిల్లా అడ్మినిస్ట్రేషన్ నుంచి లభిస్తుందని, మరిన్ని కిచెన్ గార్డెన్స్ తో పాటుగా పర్యావరణ పరిరక్షక ప్రాజెక్టులతో ముందుకు రావాలని కోరారు. జనగామ వంటి కొత్త జిల్లాకు సంస్థ సేవలు ఎంతగానో అవసరమని, సంస్థ లోని పర్యావరణ పరిరక్షణ శాఖతో పాటు ఇతర ఉత్పత్తి రంగాల, ఉపాధి అవకాశాల మెరుగుకు తోడ్పడే శాఖల సేవలను విస్తరించాలన్నారు. ప్రస్తుతం చేపట్టిన కిచెన్ గార్డెన్ల ఏర్పాటుకు గ్రాస్ రూట్ లెవెల్ సహకారాన్ని కేజీబీవీ హెచ్ఎంల ద్వారా అందేలా చూడాలని జీసీడీవోకు తెలియజేశారు. అలాగే ఏర్పాటు పనులను పరిశీలించాల్సిందిగా డీఈవో, జీసీడీవోలను ఆదేశించారు. ఈ సమావేశంలో కలెక్టరెట్ ఏవో మన్సూర్, జీసీడీవో గౌసియా బేగం, సంస్థ ప్రతినిధులు అరుణ్ కుమార్, మేనేజర్, ఎన్విరాన్మెంట్ ప్రాజెక్ట్స్ కో ఆర్డినేటర్ నిఖిల్ పటేల్ పాల్గొన్నారు.

# హమాలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

**సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్**

**చేర్యాల, మన చౌరాస్తా :** శ్రమజీవుల పక్షాన నిలబడి సీపీఐ రాజీలేని పోరాటం చేస్తుందని, అసంఘటిత రంగాలలో పని చేస్తున్న కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి కార్మిక వర్గాన్ని ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్ అన్నారు. గురువారం చేర్యాల మండలంలోని రాంపూర్ గ్రామ శాఖ సీపీఐ 2వ మహాసభకు బండారి సిద్దయ్య అధ్యక్షతన నిర్వహించగా ఈ సభకు అందె అశోక్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అసంఘటిత రంగంలో పనిచేస్తున్న హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయకపోవడం వల్ల కార్మికులకు భద్రత కరువైందన్నారు. కష్టాన్ని నమ్ముకుని ప్రజా పంపిణీ వ్యవస్థను ముందుకు తీసుకు పోవడంతో హమాలీ కార్మికుడే కీలకమని అన్నారు. కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు కోసం ఏఐటీయూసీ దేశ వ్యాప్తంగా పోరాడుతుందన్నారు. శ్రమజీవులకు ఏ కష్టం వచ్చినా కష్ట జీవుల కమ్యూనిస్టు పార్టీగా సీపీఐ నాటి నుండి నేటి వరకు అండగా నిలబడుతూ 100సంవత్సరాల చరిత్ర కలిగిన గొప్ప పార్టీ సీపీఐ అని అన్నారు. విద్యార్థి, యువజన, కార్మిక, కర్షకులు ఎదుర్కొంటున్న అనేక సమస్యపై ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా నిరుస్తూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతుందన్నారు. గ్రామంలో ఉన్న బీటీ రోడ్డు ధ్వంసమై ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ ప్రమాదాలకు గురైన అనేక సంఘటనలు ఉన్నాయన్నా




రు. ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ఆకునూర్ నుండి రాంపూర్, నర్సాయపల్లి వయా చేర్యాల వరకు డబుల్ బీటీ రోడ్డు మంజూరు చేయాలన్నారు. రాంపూర్ నుంచి కొత్త దొమ్మాట క్రాస్ రోడ్డు వరకు బీటీ రోడ్డు నిర్మించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గ్రామానికి ఉదయం సాయంత్రం పూట బస్సు సౌకర్యం కల్పించాలని అధికారులను కోరారు. అనంతరం రాంపూర్ గ్రామ నూతన కమిటీని ఎన్నుకున్నారు. సీపీఐ గ్రామ కార్యదర్శిగా బండారి నర్సయ్య, సహాయ కార్యదర్శులుగా మలిపెద్ది నాగభూషణం, బండారి కనకయ్య, కోశాధికారిగా రంగు శంకర్, సోషల్ మీడియా అధ్యక్షునిగా చెట్టే అనిల్, ప్రచార కార్యదర్శిగా బండారి నర్సింహులు, కార్యవర్గ సభ్యులుగా బొప్పనపల్లి బాలేషా, బండారి రాజయ్య, బండారి చంద్రయ్య, మేక కుమార్, బొప్పనపల్లి బాబు ఎన్నికయ్యారు.

## విద్యార్థుల్లో నైతిక విలువలు పెంచాలి




**నర్మెట, మన చౌరాస్తా :** ప్రాథమిక దశ నుండే విద్యార్థుల్లో నైతిక విలువలను పెంపొందించే బాధ్యత ఉపాధ్యాయులదే అని జనగామ జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి బి.విక్రమ్ పేర్కొన్నారు. నర్మెట మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమాల్లో ముఖ్య అతిథిగా పాల్గొని నైతిక విలువలపై ప్రసంగించారు. చదువుతో పాటు ప్రతి విద్యార్థికి నైతిక విలువలను బోధించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి ఎం.ఐలయ్య, మండల రిసోర్స్ పర్సన్స్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## ఘనంగా హనుమాన్ జయంతి

**పాలకుర్తి, మన చౌరాస్తా :** శ్రీసోమేశ్వర లక్ష్మీనరసింహ స్వామి దేవాలయంలో గురువారం హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. క్షేత్రపాలకుడు అయి భక్తాంజనేయ స్వామి వారికి హనుమాన్ జయంతి ఉత్సవంలో భాగంగా విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనం, మూల విరాట్ కి పంచామృత చందన అభిషేకం, మన్యసూక్త హవనం, పూర్ణాహుతి, తమలపాకులు పుష్పాలంకరణ , వడ మాలతో అష్టోత్తర అర్చన అదే విధంగా ఉత్సవ మూర్తికి విశేష అభిషేకాలు వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సల్వాది మోహన్ బాబు, ఆలయ సూపరింటెండెంట్ కొత్తపల్లి వెంకటయ్య, అర్చకులు దేవగిరి లక్ష్మన్న, డీవీఆర్ శర్మ, దేవగిరి అనిల్ కుమార్, మత్తగజం నాగరాజు పాల్గొన్నారు.

## వెరిఫికేషన్ పూర్తి చేయాలి




**లింగాలఘణపురం, మన చౌరాస్తా :** లింగాలఘణపురం ఎంపీడీఓ కార్యాలయాన్ని గురువారం అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇల్లు, రాజీవ్ యువ వికాసం పథకం, ఉపాధి హామీ పనులపైన ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇల్లు, రాజీవ్ యువ వికాసం పథకానికి సంబందించిన వెరిఫికేషన్, ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ త్వరగా పూర్తి కావాలన్నారు. ఉపాధి హామీ పనులకు సంబంధించి కూలీల కనీస వేతనం ఎక్కువ పడేటట్టుగా అవగాహన కల్పించాలని, ఎక్కువ మంది లేబర్‌కి పని కల్పించాలన్నారు.



## కరెంట్ షాక్‌తో ఒకరి మృతి

**బచ్చనపేట, మన చౌరాస్తా :** కరెంట్ షాక్‌తో ఒకరు చనిపోయిన ఘటన బచ్చన్నపేట మండలం గోపాల్ నగర్‌లో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. హైదరాబాద్‌లోని ముషిరాబాద్‌కు చెందిన ఎండి అసత్ అనే వ్యక్తి గోపాల్ నగర్‌లోని బంధువుల ఇంటికి వచ్చాడు. ఇంటి పైన ట్యాంక్ లో నీళ్లు ఉన్నాయా లేవా అని చూడడానికి వెళ్లగా విద్యుత్ వైర్లు తాకి చనిపోయాడు. 11 కేవీ విద్యుత్ లైను ప్రమాదకరంగా ఉందని గత కొన్ని సంవత్సరాలుగా విద్యుత్ అధికారులు, ప్రజా ప్రతినిధులకు, ప్రజా పాలనలో గోపాల్ నగర్ వాసులు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదు. గత టీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎమ్మెల్యేకు ఎన్నో వినతి పత్రాలు కూడా ఇచ్చారు. విద్యుల్ లైను తొలగించాలి అంటే రూ.3.22 లక్షలు ఖర్చులు అవుతుందని విద్యుత్ అధికారులు ఎస్టిమేషన్ ఇచ్చారు. అంత డబ్బులు ఇచ్చుకునే పరిస్థితిలో ఇక్కడి కాలనీవాసులు లేరు. కరెంటుతో భయపడుతూ జీవనం కొనసాగిస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ప్రమాదకరమైన విద్యుల్ లైన్‌ను ఇక్కడి నుంచి తొలగించి స్థానికులు కోరుతున్నారు.




## జూన్‌లో 'ఉస్తాద్ భగత్ సింగ్'

# షూటింగ్ షురూ..

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ అభిమానులకు శుభవార్త! ఆయన నటిస్తున్న భారీ చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్' షూటింగ్ జూన్ నెల నుంచి జోరందుకోనుంది. గతంలో సూపర్ హిట్ చిత్రం 'గబ్బర్ సింగ్' కాంబోలో దర్శకుడు హరీష్ శంకర్తో పవన్ కళ్యాణ్ మరోసారి జతకట్టడంతో ఈ సినిమాపై అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. ఈ చిత్రం పూర్తి స్థాయి మాస్ ఎంటర్టైనర్‌గా రూపొందనుందని సమాచారం, ఇది అభిమానుల ఉత్సాహాన్ని మరింత పెంచుతోంది. పవన్ కళ్యాణ్ ప్రస్తుతం రాజకీయ రంగంలో ఒక బలమైన ఇమేజ్ను సొంతం చేసుకున్నారు. ఆయన జనసేన పార్టీ అధ్యక్షుడిగా, డిప్యూటీ సీఎంగా ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ నేపథ్యంలో, 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రం ఆయన రాజకీయ ఇమేజ్కు ఎలాంటి భంగం కలిగించకుండా, అభిమానుల అంచనాలను అందుకునేలా రూపొందించే బాధ్యత దర్శకుడు హరీష్ శంకర్పై ఉంది. హరీష్ శంకర్, పవన్ కళ్యాణ్తో గతంలో 'గబ్బర్ సింగ్' వంటి బ్లాక్బస్టర్ ఇచ్చిన నేపథ్యంలో, ఈ కాంబో మరోసారి మ్యాజిక్ సృష్టిస్తుందని అభిమానులు ఆశిస్తున్నారు. హనుమాన్ జయంతి సందర్భంగా సినిమా టీం ఒక స్పెషల్ పోస్టర్ను విడుదల చేసింది. ఈ పోస్టర్లో పవన్ కళ్యాణ్ ఒక వ్యక్తితో చేయి కలుపుతూ కనిపిస్తుండగా, ఆయన మెడలో ఆంజనేయ స్వామి లాకెట్ హైలైట్గా నిలిచింది. ఈ పోస్టర్ అభిమానుల్లో కొత్త ఉత్తేజాన్ని నింపింది. ఆంజనేయ స్వామి లాకెట్తో పవన్ కళ్యాణ్ లుక్, సినిమాలో ఆయన పాత్ర శక్తివంతంగా ఉంటుందని సూచనగా అనిపిస్తోంది. పవన్ కళ్యాణ్ సినిమా అంటేనే అభిమానుల్లో ఒక పండుగ వాతావరణం నెలకొంటుంది. 'ఉస్తాద్ భగత్ సింగ్' పోస్టర్తో ఆ ఉత్సాహం ఇప్పటికే మొదలైంది. సోషల్ మీడియాలో ఈ పోస్టర్ వైరల్గా మారింది, అభిమానులు తమ ఆనందాన్ని హ్యాష్ట్యాగ్లతో పంచుకుంటున్నారు. జూన్లో షూటింగ్ ప్రారంభం కానుండటంతో, సినిమా గురించి మరిన్ని అప్డేట్స్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ సినిమాను మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తోంది.